క్లుప్తంగా

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం కమలకుమారి

కె.కోటపాడు: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ప్రధానోపాధ్యాయిని కమలకుమారి తెలిపారు. కొరువాడ హైస్కూల్‌లో పదో తరగతికి చెందిన 36 మంది విద్యార్థులకు శుక్రవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. దాతల సహకారంతో ప్రతీ విద్యార్థి చదువుల్లో మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు గుర్తింపును తీసుకురావాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు. ఫౌండేషన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి సమీక్ష విజయవంతం చేయండి

మాడుగుల: కె.కోటపాడులో ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరగనుందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. మండలంలో 29 పంచాయతీల నుంచి పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సోషల్ మీడియా కన్వీనర్లు, సహకార, పాల సంఘాల అధ్యక్షులు, తదితరులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరు కానున్నారన్నారు.

నవ్వులు పూయించిన టీవీ ఆర్టిసులు



అమ్మవారి సేవలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత తీర్థం సందర్భంగా శుక్రవారం రాత్రి టీవీ ఆర్టిసులు తమ అభినయంతో అలరించారు. నటులు రాపేట అప్పారావు, నవీన్, మోహన్ (మహిళా పాత్రధారి) వేసిన స్కిట్లు నవ్వులు పూయించాయి. డ్యాన్సు కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. గోవాడ సుగర్స్ పరిపాలనాధికారి పి.వి.రమణమూర్తి, ఆలయ కమి టీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో అన్నసమారాధన నేడు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరి దేవి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా మాదిరిగా దేవితల్లీ తీర్థ మహోత్సవాలు పూర్తయిన తర్వాత ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేస్తామన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

కె.కోటపాడు: పిండ్రంగిలో సీతారాముల తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సీతారాముల ఆలయంలో గ్రామస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థం సందర్భంగా బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం



బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్న సిబ్బంది

దేవరాపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అధికారులు దగ్గరుండి సిబ్బందితో శుభ్రం చేయించారు. వీటిలో కొన్ని అనకాపల్లికి పంపిస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. మండలంలో 156, 157 నెంబర్లతో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1439 మంది ఓటర్లు ఉన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణకు సన్నాహాలు

- ముమ్మరంగా సర్వే పనులు
- రూ.16.60 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



ఎఫ్‌ఎంబీ రికార్డు ఆధారంగా మెయిన్‌రోడ్డుకు మార్కింగ్ ఇస్తున్న సర్వేయర్ రమణ, మున్సిపల్ సిబ్బంది

నర్సీపట్నం: పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణ పనులకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ అబిద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు వందల అడుగులు, వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కో కళాశాల వరకు 40 అడుగుల మేర లింక్ రోడ్డును విస్తరించనున్నారు. వచ్చే నెలలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.16.60 కోట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని రూరల్ ప్రాంతంలో నర్సీపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెయిన్ రోడ్డును 1.5 కిలోమీటర్లు వంద అడుగులు, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల వరకు 2.5 కిలోమీటర్ల పొడువున 40 అడుగులు విస్తరించనున్నారు. రోడ్డు విస్తరణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు వినియోగిస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద ఉన్న మెయిన్ రోడ్డు రికార్డు ఆధారంగా రెండు రకాల సర్వే నిర్వహించారు. వీరు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రౌండ్ లెవల్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని డీజీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ఆర్టీకే (రీయల్ టైం కినేమాటిక్) రెండు రకాల సర్వే చేసి నివేదిక సిద్ధం చేశారు. రోడ్డు విస్తరణ మరింత పారదర్శకంగా చేసేందుకు ఎఫ్‌ఎంబీ(ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్) రికార్డును ప్రామాణికంగా తీసుకుని సర్వే చేసి, మెయిర్‌రోడ్డు హద్దులను నిర్ణయిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగియగానే రోడ్డు మధ్యలో సెంటర్ పాయింట్లు ఏర్పాటు చేసి, ఇటు 50 అడుగులు, అటు 50 అడుగులు రోడ్డు విస్తరించనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులకు ముందుగా నోటీసులు జారీ చేసి విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టనున్నారు.

కొద్ది రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు...



రోడ్డు విస్తరణకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ పారదర్శకంగా చేపట్టేందుకు వీలుగా మూడు రకాల సర్వేలు నిర్వహించాం. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న స్థిరాస్తులను సైతం సర్వే చేస్తున్నాం. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే బాధితులకు నోటీసులు ఇచ్చి రోడ్డు విస్తరణ పనులు మొదలు పెడతాం.

– కె.కనకారావు, కమిషనర్, నర్సీపట్నం మున్సిపాలిటీ

చెరువుల సందరీకరణకు ప్రణాళిక సిద్ధం

- మొదట విడతలో మండలానికి ఒక్క చెరువు ఎంపిక
- నర్సీపట్నం డీఎల్పీవో మూర్తి



మర్రిపాలెంలో పెద్ద చెరువును పరిశీలిస్తున్న డీఎల్పీవో మూర్తి

నాతవరం: చెరువుల సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని నర్సీపట్నం డీఎల్పీవో ఎస్.ఎ స్.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. మర్రిపాలెంలో పెద్ద చెరువును శుక్రవారం ఆయన పరిశీలించారు. దీన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో సిబ్బందికి సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని పరిశీలించి వర్మీ కంపోస్టు తయారీ చేయడం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదట విడత కింద డివిజన్‌లో మండలానికి ఒక్క చెరువు చొప్పున ఎంపిక చేస్తామన్నారు. వీటిని ఏవిధంగా అభివృద్ధి చేయాలన్న విధి విధానాలపై ఈ నెల 28వ తేదీన కలెక్టరు సమావేశం ఏర్పాటు చేస్తారన్నారు. నాతవరం మండలంలో మర్రిపాలెంలో పెద్ద చెరువును ఎంపిక చేశామన్నారు. షెడ్లు నిర్మించిన పంచాయతీలో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. షెడ్లు లేని చోట యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్త సేకరణ చేయడంతోపాటు వీధులను శుభ్రంగా ఉంచడటం వల్ల ప్రజలకు రోగాలు రాకుండా నివారించవచ్చున్నారు. వేసవి దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ ప్రేమలీల, మర్రిపాలెం, నాతవరం, సరుగుడు పంచాయతీ కార్యదర్శులు రమణ, చినబాబు, సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మంకు సాంబమూర్తి పాల్గొన్నారు.

అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా స్వర్ణ



చోడవరం రూరల్: చోడవరం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా జి.స్వర్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ స్థానం ఖాళీగా ఉంది. ప్రధాన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.ఉమాదేవి ఏజేఎఫ్‌సీఎం కోర్టు విధులను అదనంగా నిర్వహిస్తుండేవారు. దీనివల్ల పలు కేసుల పరిష్కారానికి ఆటంకంగా మారింది. ఈ నేపథ్యంలో కాకినాడలో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న స్వర్ణ ఇక్కడ న్యాయమూర్తిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించనున్నారు. శుక్రవారం ఏజేఎఫ్‌సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె సీనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవి అభినందించారు. పలువురు న్యాయవాదులు, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏపీపురం వీఆర్వీపై విచారణ



సచివాలయంలో విచారణ చేస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: నిబంధనల ప్రకారం పనులు చేయకుండా అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. అనంతపద్మనాభపురం పంచాయతీలో వీఆర్పీగా పని చేస్తున్న అల్లు అమ్మాజీపై స్థానికులు ఇటీవల కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఉపాధి ఏపీవో చిన్నారావు కలిసి గ్రామంలో శుక్రవారం బహిరంగ విచారణ చేపట్టారు. పంచాయతీలో ఉపాధి పనులతోపాటు గతంలో చేసిన పనులను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మస్టర్ల నమోదు తదితర అంశాలపై సచివాలయం వద్ద విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారు. వీటి నివేదిక కలెక్టరుకు పంపిస్తామన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మాకవరపాలెం: విద్యార్థినుల నృత్య ప్రదర్శలు విశేషంగా అలరించాయి. ఉగాది సందర్భంగా గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థినులు హాజరయ్యారు. వీరంతా దేశభక్తి, జానపద గేయాలలోపాటు వివిధ పాటలకు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఇందులో విజేతలు ఉగాది రోజున సాయంత్రం ప్రదర్శన చేయాలని, బహుమతులు అందజేస్తామన్నారు. గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం అధ్యక్షుడు రంగరాజు, కార్యదర్శి శేషగిరిరావు, హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ 30వ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానిక వినాయక ఆలయ 30వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీనిలో భాగంగా ధనుర్మాసం మేలుకొలుపుల కార్యక్రమంలో వినాయక, జీవకారుణ్య సంఘాలకు చెందిన సభ్యులు సంయుక్తంగా భక్తుల నుంచి సేకరించిన స్వయంపాకం సరకులు, కానుకలతో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇక్కడ ఆలయ ఆవరణలో కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

గోవాడలో ఒకరికి డెంగ్యూ

- గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ దమయంతీదేవి

చోడవరం రూరల్: గోవాడ గ్రామంలో ఒకరికి డెంగ్యూ వ్యాధి సోకింది. ఈ సమాచారం విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రి నుంచి అందడంతో గవరవరం పీహెచ్‌సీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వేను సమగ్రంగా చేపట్టారు. గ్రామంలో ఒకరు గత శనివారం జ్వరం బారిన పడ్డారు. మంగళవారం కేజీహెచ్‌కు తరలించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. గురువారం ఆమెకు డెంగ్యూ సోకినట్టుగా వైద్య పరీక్షలో తేలడంతో సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన చేరుకున్న వైద్యాధికారి డి.దమయంతీదేవి, సిబ్బంది బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచారు. గ్రామంలో డెంగ్యూ నిరోధక ఎస్.ఎస్.స్ప్రేయింగ్ చేయించారు. వైద్య సిబ్బంది శ్యామలాదేవి, రత్నం, మురళి, రామకృష్ణ, జగన్, వరలక్ష్మి, పద్మ సేవలందించారు. చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు సహకరించారు.

గిరిజన గ్రామాల్లో రోడ్డు ఏర్పాటుకు అంచనా



గిరిజన గ్రామాల్లో కొలతలు వేస్తున్న అధికారులు

రోలుగుంట: గిరిజన గ్రామాల్లో రహదారి ఏర్పాటు చేసి, వారి కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా పీఆర్ చోడవరం డివిజన్ డీఈ ప్రసాదరావు, డీఈ మోహన్, ఆర్‌అండ్‌బీ ఏఈ జయరాజ్‌లు శుక్రవారం మండల కార్యాలయంలో పీఆర్ మండల జేఈ ఉమామహేశ్వరుడితో చర్చించారు. గత నెలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గుర్తించిన గిరిజన గ్రామాలకు వెళ్లారు. కొండ దిగువున వై.బి.పట్నం నుంచి కొండపైనున్న పాత, కొత్త లోసింగు గ్రామాలకు రహదారి ఏర్పాటు కోసం శరభవరం, బుచ్చింపేట గ్రామ సచివాలయాల సహా ఇంజినీర్లతో కొలతలు కొలిపించి 4.1 కిలోమీటరు దూరంగా గుర్తించారు. ప్రభుత్వ విప్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలికి అభినందన



అనురాధను సన్మానిస్తున్న అమ్మాజి

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధను పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు పైల అమ్మాజి అభినందనలు తెలిపారు. కె.కోటపాడులో శుక్రవారం సాయంత్రం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. అనురాధ నాయకత్వంలో జిల్లాలో పార్టీ మహిళా విభాగం మరింత పటిష్టమవుతుందన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ

నాతవరం: మండలంలోని చమ్మచింత, నాతవరం గ్రామాల్లో అడవిరాజులబాబు పండగను శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజులబాబులను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వలంటీర్ తొలగింపు

మాకవరపాలెం: ఇద్దరిపై కత్తితో దాడి చేసిన వలంటీర్‌ను విధుల నుంచి తొలగించామని ఎంపీడీవో అరుణశ్రీ శుక్రవారం తెలిపారు. లచ్చన్నపాలెం గ్రామ వలంటీర్ పోతల కొండబాబు తన పెంపుడు కుక్కల వల్ల ఇబ్బంది పడుతున్నామని ప్రశ్నించిన ఇద్దరిపై రెండు రోజుల క్రితం కత్తితో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండబాబుపై కేసు నమోదు కావడంతో అతడిని విధుల నుంచి పూర్తిగా తొలగించామన్నారు.

హృద్రోగ వైద్య శిబిరానికి స్పందన



జంపెనలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల: కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జంపెనలో నిర్వహించిన ఉచిత మెగా హృద్రోగ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ అనున్యూరో కార్డియాక్ సైన్సెస్ వైద్యులు సుమారు 150 మందికి హృద్రోగ బాధితులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జంపెన వాసవీమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహనరావు, క్లబ్ చైర్మన్ మేడిశెట్టి అర్జునరావు, జోన్ చైర్మన్ శ్రీనాథు కన్నయ్యశెట్టి, వాసవీమాత క్లబ్ సభ్యుడు పుట్టా మల్లికార్జునరావు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



మృతుడి పిల్లలకు నగదు అందజేస్తున్న దృశ్యం

రోలుగుంట: బుచ్చింపేట పంచాయతీ శివారు గుర్రంపేట గ్రామానికి చెందిన ఉప్పాల రమణ మృతితో తక్షణ సాయంగా ఎంపీడీవో ప్రభాకరరావు సర్పంచ్ చంద్ర, ఎంపీటీసీ సత్యవతి రూ.10 వేలు అందజేశారు. రమణకు వైఎస్సార్ బీమా వర్తించడంతో దహన సంస్కారాలకు గాను ఈ మొత్తం శుక్రవారం అతడి కుమార్తెలు అశ్విని, కుమారిలకు అందజేశారు. ఇతని భార్య గతంలోనే మరణించింది.

గర్భిణుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

రోలుగుంట: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణుల ఆరోగ్య పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఎంపీడీవో కె.ప్రభాకర్రావు సిబ్బందిని ఆదేశించారు. అర్ల గిరిజన పంచాయతీ శివారు పెద గరువు గ్రామానికి చెందిన కిలో కోమలికి నెలలు నిండకుండా పుట్టిన పాప రెండో రోజే మరణించిన విషయం విదితమే. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. గర్భిణిగా నమోదు నుంచి ప్రసవం వరకు ఏఎన్‌ఎంలు ప్రతి నెలా పరీక్షించాలన్నారు. కేంద్రాల్లో సూపర్‌వైజర్లు విధిగా తనిఖీ చేయాలన్నారు. కార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

పసికందు మృతిపై స్పందించిన అధికారులు

- గిరిజన గ్రామానికి వెళ్లిన మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి

రోలుగుంట: కొత్త పంచాయతీ అర్ల శివారు పాత, కొత్త లోసింగు, పెద గరువు గ్రామాలను మండల ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు పలు శాఖల అధికారులతో శుక్రవారం సందర్శించారు. అక్కడ గిరిజనులందరినీ పాత లోసింగులో సమావేశపరిచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 200పైగా జనాభా ఉన్న తమ గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రం గాని, మినీ వైద్య కేంద్రం గాని, 35 మంది పిల్లలకు పాఠశాల లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోయారు. ధ్రువపత్రాలు లేక సంక్షేమ పథకాలు మంజూరు కావడం లేదన్నారు. వీటిపై ప్రత్యేకాధికారి స్పందించి ఆశ కార్యకర్త పోస్టును మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్‌కు నివేదించాలని నర్సీపట్నం ఐసీడీఎస్ పీవోకు సూచించారు. ముందుగా సరైన రహదారి లేక కిలో కోమలికి జన్మించిన పాపను రెండో రోజే డోలీ మోతతో వైద్యానికి తరలిస్తుండగా మృతి చెందిన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎంపీడీవో ప్రభాకరరావు, డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి, ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావు, బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యుడు ప్రసాదరాజు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: భూ రీసర్వేతో ఏళ్ల తరబడి వెంటాడే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు పి.కనకారావు తెలిపారు. డొంకాడ అగ్రహారంలో శుక్రవారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 38 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామన్నారు. వాటికి సంబంధించిన మ్యాప్‌లు వచ్చిన వెంటనే భూముల రీసర్వే వేగవంతం చేస్తామన్నారు. సర్వే చేసేటప్పుడు ఏమైనా సందేహాలుంటే సిబ్బంది నివృత్తి చేస్తారన్నారు. ఆర్‌ఐ నారాయణరావు, వీఆర్వో బాబు, సర్వేయర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు పనులకు భూమి పూజ



పనులకు భూమి పూజ చేస్తున్న బూడి సతీమణి రమణమ్మ

చీడికాడ: అప్పలరాజుపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంకు, జలజీవన్ మిషన్ పైపులైన్ పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు మాట్లాడుతూ దేవినగర్ కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి రూ. 90 లక్షలు, ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు రూ. 50 లక్షల చొప్పున డిప్యూటీ సీఎం కేటాయించారన్నారు. నాయకుడు కురచా నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట వేడుకలు

దేవరాపల్లి: నాగయ్యపేట పంచాయతీ శివారు సీతంపేటలో మరిడిమాంబ అమ్మవారి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు పాల్గొన్నారు. టీడీపీ నేతలు పీవీజీ కుమార్, పైలా ప్రసాదరావు, ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మ, సర్పంచ్ కర్రి పుష్ప అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతంపై ఫిర్యాదు



రాజాంలో ప్రభుత్వ స్థలం

బుచ్చెయ్యపేట: రాజాంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ సర్వే నంబర్ 233లో 30 ఎకరాలు కొండపోరంబోకు భూమి ఉంది. ఈ భూమిని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణంతోపాటు పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం కేటాయించారు. ఈ భూమిని ఇటీవల కొంతమంది నాయకులు, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కై ఇతరులకు విక్రయించడానికి చర్యలు చేపడుతున్నారని మాజీ సర్పంచ్ మరిసా పెదరమణ, మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్, గ్రామస్తులు మరిసా నరేష్, ఎస్‌కే వల్లి, యండపల్లి సత్యారావు తదితర్లు ఫిర్యాదు చేశారు.

లేగదూడపై కుక్కల దాడి

మాకవరపాలెం: జి.కోడూరులో లేగదూడపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఉప్పునూరి రమణకు చెందిన పశువుల పాక వద్ద లేగదూడపై శుక్రవారం వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో మెడ, కాలి భాగాల్లో తీవ్ర గాయాలైన దూడకు పశువైద్యులు వైద్య సేవలందించారు. కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.